క్లుప్తంగా

నేటి నుంచి 'ప్రణాళిక'పై శిక్షణ

రేపల్లె రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల (జీపీడీపీ)పై మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వేర్వేరుగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎంపీడీవో ఎం.శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు, 16న ఉదయం 10.30 గంటలకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, గ్రామ సమాఖ్య అధ్యక్షులకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. తరగతులకు ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

ప్రగతికి ప్రణాళికలే కీలకం



కర్లపాలెం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు కీలకమైనందున సమర్థంగా సిద్ధం చేయాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల, గ్రామస్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో ఎంపీడీవో మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నిధులతో పనులు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, పీఆర్ఏఈ రమేష్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ



పెదపులివర్రు (భట్టిప్రోలు): భట్టిప్రోలులో గురువారం అయ్యప్ప స్వామి పడి పూజ ఘనంగా నిర్వహించారు. భజనలు, పాటలతో ప్రాంగణమంతా మారుమోగింది. కొలుసు వెంకట నాగచైతన్య-ఉదయలక్ష్మీ దంపతులు స్వామిని వైభవంగా అలంకరించారు.

విఠలేశ్వరనగర్‌లో సర్పంచ్ పరిశీలన



భట్టిప్రోలు: భట్టిప్రోలు విఠలేశ్వరనగర్ కాలనీలో చేరిన నీటిని సర్పంచ్ దారా రవి కిరణ్మయి గురువారం పరిశీలించారు. స్థానికుల ఇబ్బందులను తెలుసుకున్నారు. సాక్షి దినపత్రికలో ఈ నెల 11వ తేదీన విఠలేశ్వర... ఊరు వాగైంది అనే శీర్షికన వచ్చిన కథనానికి ఆమె స్పందించారు. సమస్య తీవ్రతను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖాధికారులతో మాట్లాడినట్లు, పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీపీఐ నేతకు నివాళి



భట్టిప్రోలు: సీపీఐ నియోజకవర్గ సీనియర్ నాయకుడు బట్టు కనకయ్య (95) గురువారం మృతి చెందారు. ఐలవరం గ్రామానికి వెళ్లి ఆ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. రాష్ట్ర సమితి సభ్యుడు నాగాంజనేయులు, నేతలు జి. బాలాజీ, బి. శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు డి. రామారావు, డి. సత్యన్నారాయణ, సీపీఐ (ఎంఎల్) నాయకులు ఎం. వెంకట్రావు, డి. శ్రీనివాసరావు, కె. సీతారామారావు, ఏఐటీయూసీ నాయకులు వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

బాపట్ల టౌన్: వివాహిత అదృశ్యమైన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన ప్రమోదారాణి సెప్టెంబర్ 30న ఇంటి నుంచి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదని తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

కర్లపాలెం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎం.వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. స్థానిక కార్యాలయంలో మండల కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. మండల అధ్యక్షుడిగా బీవీ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా వి.రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా వైపీ నారాయణ, మహిళా కార్యదర్శిగా ఎస్.సుప్రియ, కోశాధికారిగా కె.సతీష్, సమాచార ప్రచార కన్వీనర్‌గా ఇ.పోలీస్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గంలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పటేల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించి వేడుకల్లో మున్సిపల్ డీఈ మధుసూదనరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. మున్సిపల్ ఏఈ శామ్యూల్, హెచ్ఎం సుశీల, ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని శ్రీగుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. చిత్రలేఖనం, నృత్యం వంటి పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంసీఏ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రేపల్లె రూరల్: పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలులో గురువారం బాలల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ ప్రసంగించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె ఎంసీఏ హాలులో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

విదేశీయులతో విద్యార్థుల సంభాషణ

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ దేశాలలోని ఉపాధ్యాయులతో వర్చువల్‌గా ఆంగ్లోపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ గురువారం విద్యార్థులను మాట్లాడించారు. దేశ గొప్పతనం వివరించే ప్రదర్శనలు, యోగాసనాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇన్‌చార్జి హెచ్ఎం బదరీ నారాయణ, ఉపాధ్యాయులు ఆర్ఆర్ కిషోర్, తాండవకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న మధుసూదనరావు



మాట్లాడుతున్న విద్యార్థి



సాంస్కృతిక ప్రదర్శన దృశ్యం

ధరలను నియంత్రించాలని డిమాండ్

రేపల్లె రూరల్: నిత్యావసరాల ధరలను నియంత్రించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. ఇప్పటికే వరదలతో ఉపాధి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి నేతలు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపటం దుర్మార్గమన్నారు. ఇసుక ధరలు తగ్గిస్తామనే హామీ ప్రకటలకే పరిమితం అయిందన్నారు. మద్యం ధరలు తగ్గించామని గొప్పలు చెప్పడం మాని నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ఉంటే అందరికీ మేలు జరిగి ఉండేదన్నారు. ఇళ్ల స్థలాలు లేనివారికి పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రజా సంఘాల నేతలు కె.ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, ఆగస్టిన్, జి.డానియేలు, నాంచారమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మాజీ జడ్పీటీసీకి పిన్నెల్లి పరామర్శ



చుండూరు (వేమూరు): మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం మాజీ జడ్పీటీసీ గాదె శివ రామకృష్ణారెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా పిన్నెల్లి మాట్లాడుతూ.. గాదె శివ రామకృష్ణారెడ్డి చుండూరు మండలం నుంచి రెండుసార్లు జడ్పీటీసీగా పని చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా సేవలు అందించినట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యల కారణంగా ఇబ్బంది పడుతున్న ఆయన్ను తెనాలిలోని ఇంటికి వెళ్లి పరామర్శించినట్లు చెప్పారు. ఆయన వెంట తెనాలి కౌన్సిలర్ జి. సురేంద్ర, మాజీ ఎంపీటీసీ దాట్ల మోహన రెడ్డి, వేజండ్ల వేణు యాదవ్, అనపురెడ్డి వీరారెడ్డి, తమ్మ ఇంద్రసేనారెడ్డి, ఆళ్ల నరేంద్ర రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ముఖ్యం

కర్లపాలెం: క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ రాజ్‌కిరణ్ చెప్పారు. గురువారం యాజలి గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజ్‌కిరణ్ మాట్లాడుతూ వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే నయం చేయవచ్చని చెప్పారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ వ్యాధి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు గోపీనాథ్, ఎంపీడీవో శ్రీనివాసరావు, హెచ్‌వీ ప్రభావతి, సీహెచ్‌వో దీప్తి సౌజన్య, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో డాక్టర్ రాజ్‌కిరణ్ తదితరులు

పేదల పక్షాన సీపీఐ పోరాటం

రెంటచింతల: పేదల సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం చేస్తున్నట్లు పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కె. రంగనాయకులు అధ్యక్షతన ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం స్థలం ఇవ్వాలని 18న గ్రామ సచివాలయాలలో అర్జీలు ఇచ్చే కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తూతూ మంత్రంగా ఉచిత సిలిండర్లు ఇచ్చిందన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారు ఈ నెల 27న కలెక్టర్ కార్యాలయానికి వ్యక్తిగత అర్జీలు ఇవ్వడానికి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుసేన్, మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మారుతి వరప్రసాద్

సమస్యల పరిష్కారానికి వినతి



వేమూరు: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఈ నెల 25వ తేదీ తర్వాత సమ్మె చేస్తామని 108 సిబ్బంది తెలిపారు. ఈ మేరకు తమ డిమాండ్ల పరిష్కారానికి గురువారం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు హైస్కూల్‌లో క్విజ్, ఇంట్రాక్టివ్ ప్యానల్, ప్రో కబడ్డీ ర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్ వ్యవహరించారు. క్విజ్ విద్యార్థులకు ఉపయోగకరమని హెచ్ఎం అరుణకుమారి తెలిపారు. ఈ పోటీలలో టి.హేమకుమార్, ఎం.వంశీ తేజ, ఆర్.రోహిత్ కుమార్, ఎస్.వంశీ సాయితేజ, కె.యశ్వంత్, వి.మనోజ్, సీహెచ్ జసిక, ఎస్.కుసుమ భార్గవిక, పి.ప్రవల్లికలు ప్రతిభ చూపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి

తెనాలిఅర్బన్: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చూడాలని సెకండరీ హెల్త్ విభాగ రాష్ట్ర డైరెక్టర్, ఐఏఎస్ అధికారిణి డాక్టర్ సిరి సూచించారు. తెనాలి జిల్లా వైద్యశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో నిర్వహిస్తున్న ఈ హాస్పటల్ సేవలపై ఆరా తీశారు. రోగుల వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అనేది పరిశీలించి, అలాగే సెమిసర్వీసెస్ సేవల వివరాలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంతమంది గుండె సంబంధిత రోగులకు ప్రథమ చికిత్స అందించారు అనే దానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యశాలలోని ల్యాబ్‌లను పరిశీలించి అక్కడ అందిస్తున్న టెస్ట్‌లపై ఆరా తీశారు. టెస్ట్ రిపోర్టులు త్వరగా ఇచ్చే విధంగా చూడాలన్నారు. అలాగే ఓపీ విభాగాన్ని, పలువార్డులను పరిశీలించి అక్కడ రోగులతో మాట్లాడారు. వైద్యశాలలో అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయాలేదా అనే దానిపై ఆరా తీశారు. వైద్యశాలకు అవసరమైన ఎక్యూప్‌మెంట్‌లు, ఇతర మౌళిక వసతుల వివరాలనువైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి ఆమెకు తెలియజేశారు. వాటిని త్వరగామంజూరు చేయించే విధంగా చూడాలని కోరడంతో ఆమె సానుకూలంగా స్పందించారు. ఆమె వెంట జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవి కిషోర్, డైరెక్టరేట్ కార్యాలయం అధికారులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



వైద్యసేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ సిరి

ఎన్‌సీడీ-సీడీ సర్వే 100 శాతం పూర్తి చేయాలి

ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: వచ్చే వారంలోపు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్‌సీడీ-సీడీ సర్వే 100 శాతం పూర్తి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవ రెడ్డి వైద్యాధికారులను, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌యంలకు ఆదేశించారు. గురువారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో మండల వైద్యాధికారి సి.హెచ్.లక్ష్మీసుధ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ-సీడీ సర్వే ఎంపీపీ పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసాంక్రమిక వ్యాధుల(ఎన్‌సీడీ) కట్టడిలో భాగంగా ఇంటింటికి సార్వత్రిక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మండల వైద్యాధికారి లక్ష్మీసుధ మాట్లాడుతూ 18సంవత్సరాలు పై బడిన వారందరికి ఆరోగ్య సిబ్బంది స్వయంగా ఇంటింటికి వచ్చి మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్(బీయంఐ) సహా పలు రకాల సస్పెక్టెడ్ కేసులను, స్క్రీనింగ్, బీపీ పరీక్షలను నిర్వహించి అత్యవసరమైన వారిని జిల్లా వైద్యశాలలో చికిత్స కొరకు రిఫర్ చేయటం జరుగుతుందన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చంద్రశేఖర్ అజాద్‌కు కేంద్ర బాలసాహిత్య అకాడమీ అవార్డు

లక్నోలో ప్రదానం చేసిన అకాడమీ

తెనాలి: ప్రసిద్ధ బాలసాహితీవేత్త, కథ, నవల రచయిత, కాలమిస్ట్, టెలీఫిలిమ్స్ రచయిత పి.చంద్రశేఖర్ అజాద్ కేంద్రబాలసాహిత్య అకాడమీ అవార్డును స్వీకరించారు. ఆయన రచించిన బాలల కథల పుస్తకం 'మాయాలోకం'కు గత జూన్‌లో కేంద్ర బాల సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించిన విషయం తెలిసిందే. లక్నోలోని భాగీరథి భవన్ ఆడిటోరియంలో గురువారం సాయంత్రం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సాహిత అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, ఉపాధ్యక్షుడు కుముద్‌శర్మ చేతులమీదుగా ఈ అవార్డును చంద్రశేఖర్ అజాద్ అందుకున్నారు. తెనాలి పూర్వడివిజనులోని ప్రస్తుత బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామం చంద్రశేఖర్ అజాద్ స్వస్థలం. వృత్తిరీత్యా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు.



గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

నగరం: విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఎం.ప్రమీల కృష్ణారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని మంత్రిపాలెం శాఖ గ్రంథాలయంలో గురువారం ర్యాలీని సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... పుస్తక పఠనానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగ పడతాయని చెప్పారు. విద్యార్థులు తమ ఖాళీ సమయంలో గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానం పెంచుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రావి శ్రీనివాసరావు, ఎం.కృష్ణారావు, గ్రంథాలయ నిర్వాహకుడు జొన్న బ్రహ్మేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఎంతో మేలు

రేపల్లె రూరల్: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నల్లూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కేపీ నాయుడు అన్నారు. నల్లూరుపాలెంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. పుస్తక పఠనంతో అనేక మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. విద్యార్థులు తమ ఖాళీ సమయంలో పఠనాన్ని అలవరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సంవత్సర కాలంలో గ్రంథాలయంలో అత్యధిక రోజులు పుస్తక పఠనం చేసిన జి.మనోజ్, ఎం.పాల్‌తేజ, ఆటల పోటీల విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం ముఖ్యం

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని మాటూరు రామారావు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ దారా రవి కిరణ్మయి వేడుకలను ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం వీధులలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో విద్యార్థులు, నిర్వాహకులు



వారోత్సవాల్లో రమణమ్మ తదితరులు

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరులో గ్రంథాలయ వారోత్సవాలు విశ్రాంత తెలుగు పండితుడు రత్నమాచార్యులు ప్రారంభించారు. గ్రంథాలయాధికారి పి శ్రీ దేవి ఆధ్వర్యంలో ముందుగా బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చుండూరు (వేమూరు): గ్రంథాలయాల్లో పుస్తకాలు ప్రతి విద్యార్థి చదవాలని మండల పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయలు వి. రమేష్ అన్నారు. అమర్తలూరు మండలంలోని యడ్లపల్లి గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన గురువారం ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు. గ్రంథాలయాధికారి బి.గిరిజ సుందరి పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

కర్లపాలెం: గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కర్లపాలెం శాఖా గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ చెప్పారు. వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.



భట్టిప్రోలులో విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రణాళిక రూపకల్పనకు శిక్షణ

భట్టిప్రోలు: గ్రామాల్లో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. గురువారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధికి సంబంధించి ప్రజా ప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. గ్రామ సభలు నిర్వహించి అవసరాల ఆధారంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. తొలుత బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ, గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. మాస్టర్ ట్రైనర్లు వక్కలగడ్డ సురేష్, అడిగోపుల చిన వెంకటేష్‌బాబు, లీలా ప్రసాద్‌లు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. వెంకట రమణ, ఈవోపీఆర్డీ టి. ఊహారాణి, ఏపీఎం జి. శ్రీమన్నారాయణ, ఏఈలు సేతు రామచంద్రరావు, శివకృష్ణ, ఏపీవో శివపార్వతి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ లలిత కుమారి

సెల్‌ఫోన్‌తో అనుబంధాలు దూరం

తెనాలి: నేటితరం సెల్‌ఫోన్‌తో ఎక్కువసేపు గడుపుతూ తల్లిదండ్రులు, పిల్లలు పరస్పరం ప్రేమను అందిపుచ్చుకోవటం లేదని ప్రముఖ నటుడు, రచయిత వంజారి కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. ప్రతిరోజూ కొంత సమయం కుటుంబంలోని పెద్దలు, పిల్లలు కలిసి మాట్లాడుకుంటే అనుబంధాలు, ఆప్యాయతలు పెరుగుతాయన్నారు. స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో గురువారం జరిగిన బాలల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిత్రలేఖనం, ఆటలు, పాటలు, చదువు, క్రమశిక్షణలో రాణించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. పదోతరగతిలో మొదటి మూడు స్థానాల్లో మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు రూ.15 వేల నగదు బహుమతులను ఇవ్వనున్నట్లు వంజారి కృష్ణమూర్తి ప్రకటించారు. ప్రసూనాదేవి, సోమశేఖర్, మనోజ్, కరిముల్లా, జాన్‌బీ, స్వర్ణమంజరి, సంపూర్ణ, నీలిమా ప్రశాంతి, శారద, శ్రీను పాల్గొన్నారు.



ఇంట్లోని బంగారం చోరీ

బాపట్ల టౌన్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారం చోరీ జరిగింది. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన గోళ్ళమూడి ఉదయ కుమారి తన భర్త సురేంద్రబాబుతో కలిసి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లారు. తిరిగి రాత్రి 8.40 గంటలకు వచ్చారు. అప్పటికే ఇంటి తాళం, బీరువా తాళం పగలకొట్టి ఉన్నాయి. బీరువాలోని రూ. 2.40 లక్షల విలువ చేసే బంగారం చోరీ చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ఆర్. అహ్మద్‌జానీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.